క్లుప్తంగా

సెంట్రల్ జైలులో బోరు ఏర్పాటు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కాగారంలో ఓ స్వచ్ఛంద సంస్థ బోరు ఏర్పాటు చేసింది. జైల్‌లో వ్యవసాయం కోసం ఉపయోగించడంతో పాటు ఖైదీల వినియోగం కోసం బోర్లు ఉన్నాయి. అయినా అక్కడ నీటి సమస్య ఉందని జైల్ అధికారులు ద్వారా తెలుసుకున్న ఉపకార చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుత రావు మంగళవారం జైల్ లోపల ఓ చోట బోరు తీయించారు. దీంతో ఆయనకు జైల్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

రామలక్ష్మణపురంలో అన్నదానం

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం రామలక్ష్మణపురంలో పోలమాంబ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆర్.వెంకట అప్పారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిపించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లిస్తే, వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు.

సెక్టార్-1లో పడకేసిన పారిశుధ్యం



సెక్టార్-1లో పార్కు గోడను ఆనుకొని పేరుకుపోయిన వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-1లో పారిశుధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసిన వ్యర్థాలు, చెత్తతో పేరుకుపోయిన రహదారులే దర్శనమిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా వ్యర్థాలు సక్రమంగా తరలించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్లను సైతం సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో కొన్ని రోజులుగా దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, మేస్త్రీలకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక సెక్టార్ల నివాసిత సంఘాల ప్రతినిదులు వెల్లడిస్తున్నారు. సెక్టార్-1 పార్కులను ఆనుకొని ఉన్న వీధుల్లో పారిశుధ్య సమస్య అధికంగా ఉంది. పార్కుల చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

8 నుంచి సమ్మర్ క్యాంప్

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ నేతృత్వంలో నితాయి సేవిని మాతాజీ ఆధ్వర్యంలో వాల్తేర్ డివైన్ టచ్ స్కూల్ క్యాంపస్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు మూడు సంవత్సరాల నుంచి 15 ఏళ్ల వరకు గల బాల బాలికలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 .30 వరకు యోగా, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, సంగీతం, నాటికలు, రామాయణ, మహాభారత గ్రంథాల నుంచి రకరకాల కథలపై చర్చ, ఫీల్డ్ ట్రిప్, స్కేటింగ్, క్రాఫ్ట్ ఆర్ట్, ఏరోబిక్స్‌పై పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నారు. అదే విధంగా పిల్లలకు రోజూ మధ్యాహ్నం భోజనం , రవాణా సదుపాయం కలదు. పూర్తి వివరాలకు 0891 2592233, 91005 56290 నంబర్లలో సంప్రదించగలరు.

చిన్నారుల పార్కుకు మోక్షమెప్పుడో?



రక్షణ గోడలేని పార్కు

- కోతకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకోని జీవీఎంసీ
- అధ్వానంగా ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు

బీచ్ రోడ్డు: తీరానికి వచ్చే చిన్నారులతో రోజూ సందడిగా ఉండే ఆ పార్కు గత కొద్ది నెలలుగా వెలవెలబోతోంది. సముద్ర అలలకు కోతకు గురై కొద్ది నెలలుగా మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. నొవొటల్ ఎదురుగా తీరం చెంతన ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు కొద్ది నెలల కిందట అలల ఉధృతికి దెబ్బతింది. పార్కు రక్షణ గోడ మొత్తం పడిపోయింది. ఈ సంఘటన జరిగిన చాలా నెలలు కావస్తున్నా జీవీఎంసీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో పార్కులో చిన్నారుల సందడి తగ్గిపోయింది.

బయట హంగులు

జీ-20 సదస్సు కోసం సాగరతీరంలో ఆధునికీకరణ పనులు చేపట్టి అందంగా ముస్తాబు చేశారు. వీటిలో పలు పార్కులను కూడా ఆధునికీకరించారు. కానీ ఆర్కే బీచ్‌కు సమీపంలోని పిల్లల పార్కును మాత్రం జీవీఎంసీ అధికారులు వదిలేశారు. పార్కు బయట రంగులు వేసి విడిచిపెట్టేశారు. లోపల ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. కనీసం రక్షణ గోడ నిర్మాణంపై కూడా దృష్టి సారించలేదు. దీంతో చిన్నారులను పార్కులోకి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కోస్టల్ బ్యాక్టరీ నుంచి వైఎంసీఏ వరకు రక్షణ గోడ నిర్మాణం, మరమ్మతులు చేపట్టిన జీవీఎంసీ అధికారులు చిన్నారుల పార్కులో మాత్రం ప్రహరీ నిర్మించకపోవడంపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును ఆధునికీకరించి, సదుపాయాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు ప్రవేశ ద్వారం



పాడైన వాటర్ ఫౌంటైన్

12వ వార్డులో కమిషనర్ విస్తృత పర్యటన



12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

- క్షీణించిన పారిశుధ్యంపై అసహనం
- శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. చినగదిలి వద్ద నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ నుంచి సూర్యతేజా నగర్ మీదుగా పార్వతీనగర్ గెడ్డ వరకు నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం గెడ్డ అంచున ఉన్న రోడ్డు పక్కన పెద్ద డంపర్‌బిన్ చుట్టూ చెత్త పేరుకుపోవడం , వీధుల్లో రోడ్డుపై అధ్వాన పరిస్థితులను ఆయన గమనించారు. దీంతో వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును పిలిచి కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే యూనిఫారం లేకుండా సివిల్ డ్రెస్‌లో విధుల్లోకి వెళ్లిన శానిటరీ ఇన్‌స్పెక్టర్.. కమిషనర్ వచ్చిన విషయం తెలుసుకుని తిరిగి ఇంటికి వెళ్లి డ్రెస్ మార్చుకుని వచ్చారు. అధికారులు వార్డులోకి వెళ్లిన సమయానికి అందుబాటులో యూనిఫారంతో లేకపోవడంతో పాటు అపారిశుధ్యంతో ఉన్న పరిస్థితులను గమనించిన కమిషనర్.. రామారావుపై అసహనం వ్యక్తం చేశారు. ఇళ్ల నుంచి చెత్త సక్రమంగా సేకరించకపోవడం వల్లే ప్రజలు చెత్త తీసుకొచ్చి రోడ్లపై వేసేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి రోజు ఇళ్ల వద్దకు వెళ్లి ఎందుకు చెత్త సేకరించడం లేదని నిలదీశారు. ఇక నుంచి రోడ్లు, డంపర్ బిన్‌లు వద్ద చెత్త కనిపించకూడదని, ప్రతి రోజు, ప్రతి ఇంటి నుంచి శత శాతం చెత్త సేకరించాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ సన్యాసిరావు, వై.శ్రీనివాసరావు, జెడ్సీ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దు అప్రజాస్వామికం

డాబాగార్డెన్స్: అర్థం లేని కారణాలతో పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్/డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సంఘాల గుర్తింపును కొనసాగించాలంటూ మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల సభ్యులు మాట్లాడుతూ ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైగా సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుతో గుర్తింపు రద్దు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆ రెండు సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, పెంటయ్య, ఇళ్లపురెడ్డి, శర్మ, మీనాకుమారి, రాధ, మంజుల, గోవిందరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మా నాయనే.. వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా'

అల్లిపురం: 'మా నాయనే నన్ను వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా' అంటూ పెదవాల్తేరుకు చెందిన సామాజిక పింఛన్ లబ్ధిదారు సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం సన్యాసమ్మ కుమారుడిని కాలికి వైద్యం నిమిత్తం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ సిబ్బంది కేజీహెచ్‌లో చేర్పించారు. రోడ్డు పక్కన చిన్న పరదాతో కట్టుకున్న గుడిసెలో ఉన్న ఆమెను చూసేవారు లేకపోవడంతో ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఒకటో తేదీ రావడంతో తనకు పెన్షన్ రాదేమోనని భయపడుతున్న ఆమెకు మంగళవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీ సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ వలంటీర్‌తో వచ్చి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో ఫించన్ మొత్తం రూ.2,750 అందజేశారు. దీంతో సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.



ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో సన్యాసమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, ప్రగడ వాసు

రెండేళ్లలో మూడు లక్షల ఉద్యోగాలు

మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో యువతకు మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పాలిటెక్నిక్ విద్యార్థులకు లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ పోర్టులోనే 25వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్లమా విద్యార్థులు కోర్సుల పూర్తి కాగానే వచ్చే ఉద్యోగావకాశాలను వదులుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ మేళా సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీల్లో చేరిన వారు నిబద్ధతతో పని చేస్తే అత్యధిక ప్యాకేజీలు వస్తాయన్నారు. డిప్లమా అనంతరం ఉన్నత విద్యకు వెళ్లడం కన్నా ఉద్యోగాల్లో చేరడం తెలివైన పనిగా ఆయన పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంటు కమిషనర్ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందిన 172 మంది విద్యార్థులకు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో హేమ ఎడోబ్స్ చైర్మన్ బి.సురేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ అకడమిక్ సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి కాలేజీలోని స్కిల్ హబ్‌ను సందర్శించారు.



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న కాయల వెంకటరెడ్డి, గాది శ్రీధర్‌రెడ్డి

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్-1 మద్దిలపాలెం ఫీడర్ పరిధిలో సబ్‌స్టేషన్ల మరమ్మతులు కారణంగా గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కేఆర్ఎం కాలనీ శివాలయం ప్రాంతంతో పాటు, ఎంవీవీ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పోలమాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

బీచ్ రోడ్డు: శివాజీపాలెంలో కొలువైన పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. ఈ కార్యక్రమంలో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ చలివేంద్రాల ఏర్పాటు



మద్దిలపాలెం కూడలిలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రం



10వ వార్డులో వివేకానందనగర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఆరిలోవ: వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో జీవీఎంసీ అధికారులు నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గం జోన్-2 పరిధిలో 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు ఏడు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా తాటి కమ్మలతో షెడ్‌లు వేసి అందులో మట్టి కుండ పెట్టి తాగునీటి అందజేస్తున్నారు. 9వ వార్డు జాతీయ రహదారిని ఆనుకొని హనుమంతవాక కూడలి వద్ద(విశాలాక్షినగర్ వెళ్లేదారి), పదో వార్డు పరిధి వివేకానందనగర్ పార్కు వద్ద, పెదగదిలి దరి విమ్స్ గోడ వైపు సర్వీస్ రోడ్డులోను, 11వ వార్డు పరిధి ముస్తఫాకాలనీ(ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రి పక్కన), అంబేడ్కర్ విగ్రహం పక్కన, 12వ వార్డు ఆరిలోవ పోలీస్ స్టేషన్ పక్కన, 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మటి కుండలో వడకట్టిన నీటిని నిత్యం బాటసారులు, వాహనచోదకులకు కోసం అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో పాటు బాటసారులు, ప్రయాణికులకు నీడ కోసం డెయిరీఫారం ఆంజనేయ విగ్రహం వద్ద, పెదగదిలి వద్ద గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి చలివేంద్రంలో నిత్యం నీటిని సరఫరా చేయడానికి ఓ వ్యక్తిని నియమించినట్టు జీవీఎంసీ ఆరిలోవ వర్క్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

మ్యాక్సీక్యాబ్ స్టాండ్ ఆధ్వర్యంలో..

జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద జైహనుమాన్ మ్యాక్సీ క్యాబ్ స్టాండ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ ప్రారంభించారు. వాహనచోదకులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాక్సీ క్యాబ్ అసోసియేషన్ సభ్యులు పాండు, చిన్న, రాజు, రవి, అప్పలరాజు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం జీవీఎంసీ ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. మద్దిలపాలెం సిగ్నల్ కూడలి వద్ద ఒకటి, మద్దిలపాలెం జాతీర రహదారి బస్‌స్టేషన్ వైపు ఒకటి, పిఠాపురం కాలనీ రోడ్డు కూడలి వద్ద, కృష్ణా కళాశాల జంక్షన్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

పబ్లిక్ డిమాండ్

సర్వీసు రోడ్డులో అనధికారిక పార్కింగ్

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డులో ఓ పార్శిల్ సర్వీసుకు చెందిన భారీ వాహనాలు నిత్యం అనధికారికంగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డు పక్కన ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఇటీవల అందమైన పార్కుగా తీర్చిదిద్దారు. ఆ పార్కులో వాకింగ్‌కు వచ్చే ప్రజలు, సర్వీసు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు భారీ వాహనాల పార్కింగ్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణమే అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలపై చర్యలు తీసుకోవాలి.

– పి.ఎస్.శాస్త్రి, పిఠాపురం కాలనీ



రోడ్డుపై నిలిపిన పార్శిల్ సర్వీసు వాహనం

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు రాస్తారోకోలు

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లకు పైగా ఉద్యమిస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన కుట్రలను ఆపకపోవడాన్ని నిరసిస్తూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ వామపక్షాలు బుధవారం పిలుపునిచ్చిన రాస్తారోకోలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న రాస్తారోకోల్లో పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేయాలని, ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.